**పంట సాగులో రైతులకు పెట్టుబడి ఇబ్బందులు రావొద్దని** ప్రతిష్ఠాత్మకంగా కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతుబంధు పథకాన్ని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు తుంగలో తొక్కింది. యాసంగి 2023, వానకాలం 2024లో పెట్టుబడి సాయం ఇవ్వకుండా పంగనామాలు పెట్టింది. పెట్టుబడి సాయం ఎగ్గొట్టడంతో బీఆర్ఎస్‌తోపాటు రైతుల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో మొన్నటి యాసంగిలో రైతుభరోసా పథకాన్ని ప్రారంభించింది. అది కూడా ఎకరాకు రూ. 15 వేలిస్తామని.. రూ.12వేలకే కుదించి..కేవలం 4 ఎకరాల వరకే రైతులకు అరకొరగా అమలు చేసి సగం మందికి 'చేయి'చ్చింది. యాసంగి ముగిసినప్పటికీ జనగామ జిల్లాలో సగం మంది పెట్టుబడి సాయం అందక రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొన్నది. ఈ సీజన్‌లోనైనా అందరికీ అందేనా? అసలు రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందా..లేదా? అన్న సందేహం వ్యక్తమవుతున్నది.

- జనగామ, జూన్ 9 (నమస్తే తెలంగాణ)



## రెండు సీజన్లలో సర్కారు మొండిచేయి

- పెట్టుబడి సాయంపై సన్నగిల్లుతున్న ఆశలు
- అధికారంలోకి వచ్చాక ఎగ్గొట్టిన కాంగ్రెస్
- యాసంగిలో అరకొరగా అందజేత
- ఈ సీజన్‌లో సాయం పంపిణీపై స్పష్టత కరువు
- వానకాలం పనుల్లో నిమగ్నమైన రైతాంగం
- పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వైపు చూపు

# ఈసారైనా రైతు భరోసా అందేనా?

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతాంగం ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నది. అన్ని పంటలకు మద్దతు ధర, వడ్లకు రూ.500 బోనస్, రూ.2లక్షల రుణమాఫీ వంటి హామీలెన్నో ఇచ్చి..ఏ ఒక్కటీ సరిగా అమలు చేయకుండా సర్కారు చేతులెత్తేసింది. రూ.2లక్షల రుణమాఫీ సగం మందికీ కాలేదు..రైతుభరోసా రూ.12వేలకు కుదించినా..అదీ అందరికి ఇవ్వలేదు. అన్ని పంటలకు మద్దతు ధర మాటలకే పరిమితమైంది. కేసీఆర్ ఉన్నప్పుడు ఠంచన్‌గా రైతుబంధు పడేది..కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఎగవేతలతోనే సరిపెడుతున్నది. ఇప్పుడు పెట్టుబడి కోసం మళ్లీ వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు మండిపడుతున్నారు.



వాజేడు : ప్రగళ్లపల్లిలో వరి విత్తనాలు చల్లుతున్న రైతు


### జనగామ జిల్లాలో సగం మంది ఆశలపై నీళ్లు..

అన్నదాతలకు పంట పెట్టుబడి గోస తీర్చాలనే సంకల్పంతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ 2018లో రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్ సర్కారు మొదట ఎకరానికి ఏడాదికి రూ. 8000 ఇచ్చి ఆ తర్వాత రూ.10 వేలకు పెంచింది. జనగామ జిల్లాలో ప్రతి సీజన్‌కు 1,69,465 మంది రైతులకు చెందిన 4,11,230 ఎకరాలకు రూ.205 కోట్ల పెట్టుబడి ఏడాదికి రెండుసార్లు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. ఇలా 2018 వానకాలం నుంచి 2023 యాసంగి వరకు మొత్తం 11 విడతల్లో అందించింది. రైతు బీమా పథకం కింద జిల్లాలో మరణించిన 2071 రైతు కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున రూ. 103.55 కోట్ల బీమా పరిహారం ఇచ్చింది. కానీ కాంగ్రెస్ వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మొన్న యాసంగిలో సగం మందికే పెట్టుబడి సాయం ఇచ్చిన ప్రభుత్వం వానకాలం సాయంపై నోరు మెదపడంలేదు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పూటకోమాట మాట్లాడుతుండడంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఉచితాల పేరిట రైతుభరోసాకు ఎగనామం పెట్టే యోచనలో కాంగ్రెస్ సర్కారు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతుండగా రైతులు పెట్టుబడుల కోసం మళ్లీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి కాంగ్రెస్ పాలనలో కనిపిస్తున్నది. విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే ప్రస్తుత తరుణంలో పెట్టుబడి సాయం ముఖ్యమని లేదంటే అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన మునుపటి పరిస్థితి తలెత్తుతుందని రైతులు వాపోతున్నారు.

**పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంతో** గత కేసీఆర్ ప్రభుత్వం వరంగల్‌లో 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టింది. శరవేగంగా 80 శాతానికి పైగా భవన నిర్మాణ పనులు పూర్తిచేసింది. అవసరమైన యంత్రాలు, పరికరాలు బిగించి 2023 నవంబర్ చివరి వరకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిర్ణయించింది. ఈలోగా ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. హాస్పిటల్‌లోని అంతర్గత, తుది పనుల పూర్తిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అవసరమైన రూ. 300 కోట్లు విడుదల చేయకుండా రాష్ట్ర సర్కారు కొర్రీలు పెడుతున్నది. నిర్మాణ వ్యయం పెరిగిందనే సాకు చూపుతూ విచారణ పేరిట కుట్రలు చేస్తున్నది. నిధుల కేటాయింపునకు మంత్రివర్గ ఆమోదం కావాలంటూ పనులకు ఆటంకం కలిగిస్తున్నది. మంత్రివర్గ సమావేశాలు జరిగినా నిధుల సంగతి తేల్చకుండా వాయిదాలు వేస్తున్నది. ఇటీవలి సమావేశంలోనూ ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా దాటవేసింది. మిగిలిన పనులు పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. దీంతో నత్తే నయం అనిపించేలా నిర్మాణ సంస్థ తన పనిచేస్తూ పోతున్నది.

- వరంగల్, జూన్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- నిర్మాణానికి అదనపు నిధుల కేటాయింపుపై కాంగ్రెస్ కొర్రీలు
- క్యాబినెట్ ఆమోదం పేరిట వాయిదాలు
- ఇటీవలి మంత్రివర్గ భేటీలోనూ లేని స్పష్టత
- 24 అంతస్తుల హాస్పిటల్ పూర్తిపై రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం
- 2021లో పనులు ప్రారంభించిన నాటి సీఎం కేసీఆర్



నత్తనడకన సాగుతున్న వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవనం

# ఆగుతూ.. సా..గుతూ!

### నత్తే నయం అనేలా వరంగల్ సూపర్ స్పెషాలిటీ పనులు

#### మొదలు కాని పరికరాల బిగింపు..

సీఎం రేవంత్‌రెడ్డి 2024 జూన్ 29న వరంగల్‌కు వచ్చి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించి సమీక్ష నిర్వహించారు. నిర్మాణ అంచనాలు పెరిగాయని ఆరోపించి విచారణ చేయనున్నట్లు ప్రకటించారు. అప్పటి నుంచి పనులు పూర్తి చేయడంలో సందిగ్ధత కొనసాగుతున్నది. ఆస్పత్రిలో వైద్య సేవలకు అవసరమైన యంత్రాలు, పరికరాలు అమర్చే పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మొదలు పెట్టలేదు. భవన నిర్మాణం చేపట్టిన కంపెనీ ప్రతినిధులు గత డిసెంబర్‌లో సంబంధిత శాఖ మంత్రితో సమావేశమైన తర్వాత పనుల్లో కొంచెం వేగం కనిపించింది. ఆ తర్వాత నెల రోజుల్లోనే మళ్లీ పాత పరిస్థితి నెలకొన్నది. మరో ఆరు నెలలు ముమ్మరంగా పనులు కొనసాగినా భవన నిర్మాణం, యంత్రాలు, పరికరాల బిగింపు పూర్తయ్యే పరిస్థితి కనిపించడందు.

పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందించే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం వరంగల్ నగరంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. భవన నిర్మాణ కోసం అవసరమైన నిధుల కేటాయింపు ప్రక్రియపై కొర్రీలు పెడుతూ పనులు పూర్తి కాకుండా కుట్రలు చేస్తున్నది. మిగిలిన కీలక ప్రాజెక్టులకు అమలు చేసిన విచారణ కుట్రలను ముందుకు తెచ్చి వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ భవన నిర్మాణం పూర్తి చేయకుండా వ్యవహరిస్తున్నది. 24 అంతస్తుల భవనం నిర్మాణం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి అయ్యింది. భవనంలోని అంతర్గత, తుది పనులను పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణం పూర్తయ్యేందుకు అవసరమైన రూ.300 కోట్ల నిధులు విడుదల చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సాకులు చెబుతూ వాయిదాలు వేస్తున్నది. భవన నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం కావాలంటూ పనులకు అడ్డంకులు కల్పిస్తున్నది. నిధుల కేటాయింపుపై స్పష్టత రాకపోవడంతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం పూర్తిపై అయోమయం కొనసాగుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే 80 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన కొది పనులను పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నది.

#### దేశంలోనే పెద్ద దవాఖాన

ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు దీటుగా పేదలకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించేలా వరంగల్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన ప్రణాళికను కేసీఆర్ ప్రభుత్వం రూపొందించింది. 35 విభాగాలు, వీటిలో 77 యూనిట్ల వారీగా వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేలా డిజైన్ ఉన్నది. గుండె, కాలేయం మార్పిడి, క్యాన్సర్‌ను నయం చేసే కీమోథెరపీ, రేడియేషన్‌తో పాటు అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పించేలా నిర్మాణం ఉండనున్నది. పది సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక ఉన్నది. సూపర్ స్పెషాలిటీ బెడ్లకు ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యం అందుబాటులో ఉండేలా నిర్మాణ సమయంలోనే ఏర్పాట్లు చేయనున్నారు. అవయవాల మార్పిడి, ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్స్, సర్జికల్, మెడికల్, ఐసీయూ విభాగాలు ప్రత్యేకంగా ఉంటాయి. 500 మంది డాక్టర్లు, వెయ్యి మంది నర్సులు, మరో వెయ్యి మంది పారామెడికల్, ఇతర సిబ్బంది పనిచేయనున్నారు. శస్త్ర చికిత్సలు, అత్యవసర సేవల కోసం సెంట్రల్ స్టెరిలైజేషన్ యూనిట్ ఉంటుంది. మొత్తంగా దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ ఆస్పత్రిగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఉండేలా కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణం చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పనులు పూర్తి చేయకుండా చోద్యం చూస్తున్నది.

#### హెల్త్ సిటీగా అభివృద్ధికి పక్కా ప్రణాళిక

వరంగల్ నగరాన్ని హెల్త్ సిటీగా అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం పక్కా ప్రణాళిక అమలు చేసింది. రాష్ట్రంలో ఏకైక హెల్త్ యూనివర్సిటీని ఇక్కడే ఏర్పాటు చేసింది. పేదలకు అత్యాధునిక కార్పొరేట్ వైద్యం అందించేందుకు 24 అంతస్తులతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంజూరు చేసింది. రూ. 1116 కోట్లతో 2500 పడకల సామర్థ్యంతో ఆస్పత్రి నిర్మాణం చేపట్టింది. 2021 జూన్ 21న అప్పటి సీఎం కేసీఆర్ ఈ పనులను ప్రారంభించారు. భవన నిర్మాణం, సర్వీసుల కోసం రూ.884 కోట్లు, వైద్య పరికరాల కోసం రూ.107 కోట్లు, ఇతర ట్యాక్సులకు రూ.125 కోట్ల చొప్పున కేటాయించారు. రోగులు, వారి సహాయకులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది అవసరాలు, క్యాంటిన్, ఇతర వసతుల కోసం భవన నిర్మాణ ప్రణాళికలో మార్పులు చేయగా, కరోనా తర్వాత నెలకొన్న పరిస్థితులతో నిర్మాణ ఖర్చులు పెరిగాయి. ఈ మేరకు అవసరమైన నిధుల కేటాయింపులను పెంచాలన్న అధికారుల ప్రతిపాదన మేరకు అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2023 నవంబర్ ఆఖరు వరకు పూర్తయ్యేలా కేసీఆర్ ప్రభుత్వం పని చేసింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పనులు నెమ్మదించగా, తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో పనులు ఆగుతూ, సాగుతున్నాయి. 2024 డిసెంబర్‌లోనే పనులు పూర్తి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొన్నది. త్వరలోనే ఈ ఆస్పత్రిని అందుబాటులోకి తెస్తామని చెబుతున్నప్పటికీ పూర్తి చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది.

# స్థలం కబ్జా చేశారని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- పెట్రోల్ పోసుకోగా దవాఖానకు తరలింపు
- పలువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

కరీమాబాద్, జూన్ 9 : తన స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపిస్తూ ఉర్సు ప్రాంతానికి చెందిన పోలెపాక కుమారస్వామి సోమవారం ఉర్సు బైపాస్‌రోడ్డులో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు, కుటుంబసభ్యులు అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించారు. కుమారస్వామి కొడుకులు తెలిపిన వివరాల ప్రకారం.. 30 ఏళ్ల క్రితం మా తాతకు ఉర్సు శివారులో సుమారు ఆరున్నర ఎకరాల స్థలం ఉండేది. మా వాళ్లను బెదిరించి బండి కుమారస్వామి సంతకాలు చేయించుకున్నాడు. ఇది ఎస్సీలకు ఇచ్చిన భూమి అని, పట్టా మారదని చెప్పినా అడ్డదారిలో మార్చుకున్నాడు. నాలుగెకరాలకు డబ్బులిచ్చి, ఆ స్థలాన్ని తాళ్ల పద్మావతి విద్యా సంస్థలకు అమ్మాడు. ఈ విషయమై కళాశాల యాజమాన్యాన్ని అడుగగా, తాము డబ్బులిచ్చి కొన్నామని, పక్కన 14 గుంటల స్థలం ఉంది.. దానిని తీసుకోమని చెప్పారు. సరే అని అందులోకి వెళ్తే పులి రంజిత్‌రెడ్డి ఈ స్థలం తనదని, ఇక్కడకు వస్తే మీ సంగతి చూస్తానని బెదిరిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురై మా తండ్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. విషయం తెలుసుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు, కుటుంబసభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కుమారస్వామి కుమారుడు శ్యాం ఫిర్యాదు మేరకు బండి కుమారస్వామి, పులి రంజిత్‌రెడ్డి, తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశంపై ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు ఆత్మహత్య ప్రేరేపిత కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



కాలిన గాయాలతో బాధితుడు పోలెపాక కుమారస్వామి



మంత్రి కొండా సురేఖతో బండి కుమారస్వామి

#### నిందితులపై చర్యలు తీసుకోవాలి..

నిందితులు బండి కుమారస్వామి, పులి రంజిత్‌రెడ్డి, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కడారి కుమార్ డిమాండ్ చేశారు. పలు దళిత సంఘాల నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. నిందితులకు అధికార పార్టీ అండదండలు ఉన్నాయని, కఠినంగా వ్యవహరించాలని కోరారు.



చీకటాయపాలెం గ్రామపంచాయతీ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

# అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని నిరసన

### కేటాయింపులో అవకతవకలపై భగ్గుమన్న మహిళలు

తొర్రూరు, జూన్ 9 : ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో కాంగ్రెస్ నాయకులు అవకతవకలకు పాల్పడ్డారంటూ పలువురు మహిళలు సోమవారం తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన 21 ఇండ్లను అర్హులైన పేదలకు కాకుండా అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. భూములు, ఇండ్లు ఉన్న వాళ్లకే మళ్లీ ఇండ్లు మంజూరు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. హౌసింగ్ కమిటీ నాయకులు మొదట తామే అర్హులమని చెప్పి, అధికారులను ఇంటికి తీసుకొచ్చి పరిశీలన చేయించారని, కానీ, చివరికి తమకే రావడం లేదని, వేరే వారికి ఇళ్లు మంజూరు చేసినట్టు చెప్పడం బాధాకరమన్నారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి న్యాయం చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో జీడికంటి కవిత, బుచ్చమ్మ, బొలగాని ఊర్మిళ, జీడికంటి శ్రీకాంత్, చిన్నాల భవాని, ప్రశాంతి, బొలగాని లచ్చమ్మ, ఎల్పుగొండ లింగయ్య, చిన్నాల విజయ్, సకీన తదితరులు పాల్గొన్నారు.



జనగామ కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పెంబర్తి కాంగ్రెస్ నాయకులు

# అనర్హులకు ఇండ్లు ఎలా ఇస్తారు?

- జనగామలో ప్రజావాణిలో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు
- రీసర్వే చేసి అర్హులకు కేటాయించాలని వినతి

జనగామ రూరల్, జూన్ 9 : జనగామ మండలం పెంబర్తి గ్రామానికి ప్రభుత్వం 40 ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే వాటిలో గ్రామ శాఖ అధ్యక్షుడు, మరికొందరు కలిసి 13మంది అనర్హులకు ఇండ్లు ఇచ్చారంటూ సోమవారం జనగామ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కాంగ్రెస్ గ్రామ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ విచారణ చేపట్టాలని హౌసింగ్ అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ నాయకులు మాట్లాడుతూ కొందరు సొంతంగా పేర్లు రాసి అధికారులకు లిస్టును అందజేశారని అన్నారు. అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మండల నాయకులు పట్టించుకొని పెంబర్తి గ్రామంలో అర్హులకు ఇండ్లు ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ప్రమేయం లేకుండానే కొందరు సొంతంగా పేర్లు రాసి ఇచ్చారన్నారు. కార్యక్రమంలో దుర్గేశ్, సంకటి యాదగిరి, బండ ప్రభాకర్, రామచంద్రం, భానుచందర్, మల్లేశ్, నర్సింగరావు, నరేశ్ పాల్గొన్నారు.

#### కులం పేరుతో దూషించి కొట్టిందని

# అవమాన భారంతో బాలుడి ఆత్మహత్య

### నల్లబెల్లి మండలం కొండాపూర్‌లో ఘటన



బెల్ల శ్రీకాంత్(ఫైల్)

నల్లబెల్లి, జూన్ 9 : ఓ మహిళ కులం పేరుతో దూషించి విచక్షణ లేకుండా కర్రతో చితకబాదడంతో తట్టుకోలేక ఓ బాలుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కొండాపూర్‌లో సోమవారం జరిగింది. మృతుడి తల్లి బెల్ల లక్ష్మి కథనం ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన బెల్ల శ్రీకాంత్(14) ఇంట్లో ఆదివారం మేకను కోయగా రక్తం అంటిన చేతులను తన ఇంటి సమీపంలో ఉన్న కోల కొమురమ్మకు చెందిన నీటి తొట్టిలో కడిగాడు. అయితే రక్తం మరకల చేయిని తమ నీటి తొట్టిలో ఎలా కడుగుతావంటూ కులం పేరుతో సంబోధిస్తూ కర్రతో విచక్షణారహితంగా బాలుడిని కొట్టింది. ఆ అవమానం భరించలేక బాలుడు ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు నర్సంపేట ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. బాలుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

మరిన్ని వార్తలు 8లో..



కలెక్టరేట్ ఎదుట మృతదేహంతో ధర్నా చేపట్టిన గ్రామస్తులు, బంధువులు

నాగరాజు(ఫైల్)

# ఆరోగ్యం బాగాలేదని వస్తే ప్రాణమే పోయింది..

- వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని తల్లిదండ్రుల ఆరోపణ
- న్యాయం చేయాలని భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ

మహదేవపూర్/భూపాలపల్లి రూరల్, జూన్ 9 : మహదేవపూర్‌లోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతోనే నాగరాజు మృతి చెందాడని ఆరోపిస్తూ సోమవారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా చేశారు. వివరాలి లా ఉన్నాయి.. ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన రాళ్లబండి నాగరాజు(23) తన తల్లి సరోజనకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో మండల కేంద్రంలోని ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చాడు. గత కొన్ని రోజులుగా నీకు ఆకలిగా లేదని, నువ్వు కూడా వైద్యం చేయించుకోమని నాగరాజుకు తల్లి సూచించడంతో పరీక్షలు చేయించుకొని గ్లూకోజ్ ఎక్కించుకున్న కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే వైద్యులు జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రికి తీసుకువెళ్లాలని చెప్పడంతో తల్లిదండ్రులు అక్కడికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి నాగరాజు అప్పటికే చనిపోయాడని నిర్ధారించారు. వైద్యం వికటించే తమ కుమారుడు చనిపోయాడని తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై డాక్టర్‌ని వివరణ కోరగా నాగరాజు కొన్ని రోజులుగా వికారం, విరోచనాలు, కడుపులో మంట ఉందని చెప్పగా, దానికి ట్రీట్‌మెంట్ చేస్తుండగా ఫిట్స్ వచ్చి పరిస్థితి విషమంగా ఉండడంతో భూపాలపల్లి ఆసుపత్రికి రెఫర్ చేశామన్నారు. మహదేవపూర్ ప్రభుత్వ దవాఖానలో వైద్యం వికటించి తన కొడుకు మృతిచెందాడని మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

#### కలెక్టరేట్ ఎదుట ఆందోళన

నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఎల్కేశ్వరం గ్రామస్తులు, మృతుడి బంధువులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మృతుడి తమ్ముడు సాగర్, బంధువు లు మాట్లాడుతూ నాగరాజుకు వైద్యులు సెలైన్ పెట్టి అందులో సూదితో మందు కలపగా ఒకే సారి అరుస్తూ నురుగలు కక్కుతూ వాంతులు చేసుకున్నాడని అన్నారు. వెంటనే అంబులెన్స్‌లో భూపాలపల్లి వంద పడకల ఆసుపత్రికి పంపించారని తెలిపారు. నాగరాజు మృతికి కారకులైన డాక్టర్లు, వైద్య సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మహదేవపూర్, భూపాలపల్లి ఎస్సైలు పవన్‌కుమార్, సుధాకర్, సాంబమూర్తిలు కలెక్టరేట్‌కు చేరుకుని మృతుడి బంధువులు, గ్రామస్తులతో మాట్లాడారు. పోస్టుమార్టం అనంతరం వచ్చిన రిపోర్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని, మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని పోలీస్ అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.